




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త








epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం : fb.com/vaartha

PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM 15-8-2022 సోమవారం సంపుటి : 28 సంచిక : 196, పేజీలు : 8+16 వెల : 6.50






# దేశ నిర్మాణంలో శక్తిమంతమైన రాష్ట్రం
# తెలంగాణ

75 ఏండ్ల స్వతంత్ర భారతంలో ఎనిమిదేండ్ల తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు గారి దార్శనిక పరిపాలనలో బలీయమైన ఆర్థిక శక్తిగా అవతరించింది. సొంత రాబడులు, ఆర్థిక వృద్ధిరేటులో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దేశ జీడీపీతో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధిరేటు చాలా మెరుగ్గా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం ఈ ఎనిమిదేండ్లలో రెట్టింపు అయ్యింది. ఈ కృషిని ఇలాగే కొనసాగిస్తామని తెలియజేస్తూ

**యావత్ తెలంగాణ ప్రజలకు 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.**





2015-16 నుంచి 2020-21 మధ్య తెలంగాణ రాష్ట్రం పన్నుల ద్వారా వచ్చిన రాబడిలో సగటున 11.5% వృద్ధిరేటుతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 9.7 శాతంతో ఒడిశా రెండో స్థానంలో ఉంటే.. 9.2 శాతంతో హర్యానా మూడో స్థానంలో నిలిచింది.

**2014-15లో తెలంగాణ ప్రభుత్వ ఆదాయం రూ.62,306 కోట్లు మాత్రమే. 2021-22 నాటికి తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి వల్ల 1.84 లక్షల కోట్లకు పెరిగింది. అంటే.. ఎనిమిదేండ్లలోనే ప్రభుత్వ ఆదాయం మూడింతలు పెరిగింది. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి తెలంగాణ ప్రభుత్వం గత ఎనిమిదేండ్లలో చేసిన మొత్తం ఖర్చు రూ.10,21,873 కోట్లు.**

2015-16 నుంచి 2020-21 నాటికి సొంత రాబడుల వృద్ధిరేటులో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచింది. సగటున 9.6% వృద్ధిరేటుతో దూసుకుపోతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది .

ఉమ్మడి రాష్ట్రంలో 2004-05 నుంచి 2013-14 వరకు పదేండ్లలో చేసిన పెట్టుబడి వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్) కేవలం రూ.54,052 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం ఎనిమిదేండ్లలో చేసిన పెట్టుబడి వ్యయం రూ.2,88,263 కోట్లు. ఇది ఉమ్మడి రాష్ట్రంలో చేసిన పెట్టుబడి వ్యయం కంటే ఐదు రెట్లు ఎక్కువ.

ఎనిమిదేండ్లలో తెలంగాణ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10.21 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. కేంద్రం ప్రాయోజిత పథకాల ద్వారా కేవలం రూ.47,312 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. రాష్ట్ర మొత్తం వ్యయంతో పోల్చితే ఇది 4.6% మాత్రమే.

దేశ జీడీపీ వృద్ధిరేటుతో పోల్చితే తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిరేటు మొదటి నుంచి అధికంగా ఉన్నది. 2020-21లో జాతీయ స్థాయిలో రుణాత్మక వృద్ధిరేటు నమోదు చేస్తే తెలంగాణ మాత్రం ధనాత్మక వృద్ధి నమోదు చేసింది.

దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.96 శాతం. కానీ.. దేశ జీడీపీలో తెలంగాణ వాటా మాత్రం ఏకంగా 4.9 శాతం. ఇది ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాల్సిన విషయం.

తెలంగాణ ఏర్పడిన మొదటి సంవత్సరం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.1 శాతంగా ఉండగా.. ఇప్పుడది 4.9 శాతానికి పెరిగింది.

తలసరి ఆదాయ వృద్ధిలో తెలంగాణ గత ఎనిమిదేండ్లలో ఎప్పుడూ జాతీయ వృద్ధిరేటు కన్నా మెరుగ్గానే ఉన్నది. 2014-15లో తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం రూ.1,24,104. ఎనిమిదేండ్లలోనే రూ.2,75,443కు పెరిగింది. అంటే తలసరి ఆదాయం రెట్టింపయ్యింది. ఇదే సమయంలో జాతీయ స్థాయిలో తలసరి ఆదాయం రూ.86,647 నుంచి రూ.1,50,007కు చేరుకున్నది.

## స్వతంత్ర భారతాన సముజ్వల తెలంగాణ

జారీ చేసిన వారు: కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం fb.com/vaartha
PUBLISHED FROM KHAMMAM, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
15-8-2022 సోమవారం సంపుటి : 28 సంచిక : 196, పేజీలు : 8+16 వెల : 6.50

అమెరికా వత్తిళ్లకు తలొగ్గని

## భారత్ విధానం భేష్:

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ 5లో

## షిండే కేబినెట్ మంత్రులకు శాఖలు కేటాయింపు

# భారత్ ప్రజాస్వామ్యం ప్రపంచానికే ఆదర్శం

### స్వాతంత్ర్యదినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఆదివారం న్యూఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థప్రపంచానికే ఆదర్శమని, ఎన్నో దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు. భారత 75వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా స్మృతి దివస్‌రోజు ఆదివారం దేశ ప్రజలకు స్వాతంత్ర్యదినోత్సవ సందేశం ఇచ్చారు. దేశంలో నిర్వహించిన సార్వత్రిక కరోనా కట్టడి వ్యాక్సినేషన్‌కార్యాచరణ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాచరణ అని ఇతర దేశాలకు మార్గదర్శిగా నిలిచిందని అన్నారు. భారత్ 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు పూర్తిచేసుకుంటున్నదని, 1947 ఆగస్టు 15న వలసపాలన సంకెళ్లను తెంచుకున్నామని, ఆశుభ సందర్భం పురస్కరించుకుని వార్షికోత్సవం నిర్వహించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. మన స్వాతంత్ర్య సమరయోధులందరికీ వందనాలని మనమంతా స్వేచ్ఛావాయువులు పీల్చుకోవడం కోసం వారంతా తమ సర్వస్వం త్యాగంచేసారన్నారు. ఈ సందర్భంగా మన మహనీయులందరినీ మరోసారి స్మరించుకోవాలన్నారు. దేశ విభజన సందర్భంగా 14వ తేదీని స్మృతి దివస్‌గా నిర్వహిస్తున్నామని, గత ఏడాది మార్చినుంచి ఆజాదికా అమృత్‌మహోత్సవ్ కొనసాగుతున్న అంశాన్ని ఆమె ≫2

# వజ్రోత్సవ వేడుకలకు భారీ భద్రత

**ఎర్రకోట చుట్టూ బహుళ అంచెల నిఘావ్యవస్థ**

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సోమవారం నాడు జరగనున్న స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకల కోసం భారీ భద్రత చేబట్టారు. పంద్రాగస్టు వేడుక లకు నాలుగు రోజుల ముందు కాశ్మీర్ లోయలో సైనిక స్థావరంపై ఉగ్రవాదులు దాడిచేయగా నలుగురు సైనికులు మరణించడం, ఆ తరువాత జరిగిన మరో రెండు ఘటనలో మరో ముగ్గురు పోలీసులు వీర మరణం పొందడం సంచలనం రేపింది. అంతకు ముందు ఢిల్లీలో భారీగా తూటాలు ≫2

# పంట రుణాల్లో ఇచ్చింది రూ.14వేల కోట్లే



### లక్ష్యం ఘనం.. ఆచరణ అంతంతమాత్రమే

**హైదరాబాద్, అగస్టు 14, ప్రభాతవార్త:** వానాకాలం సాగు ప్రారంభమై రెండు నెలలు గడచినా బ్యాంకులు రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేయడం లేదు. దీంతో సాగు పెట్టుబడుల కోసం రైతులు దిక్కులు చూస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో ఇంత వరకూ 70 శాతం వరకూ పంటలు సాగు కాగా, రుణ లక్ష్యంలో కేవలం 25 శాతం మాత్రమే బ్యాంకులు మంజూరు చేశాయి. ఈ వానాకాలం సీజనులో పంట రుణాల కింద 51,229 కోట్ల రూపాయల మేర మంజూరు చేయాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ లక్ష్యాన్ని నిర్ధారించగా, ఇప్పటి వరకూ సుమారు 13,600 కోట్ల రూపాయలు మాత్రమే రైతులకు పంపిణీ చేశాయి. తెలంగాణలో దాదాపు 65 లక్షల మంది పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న రైతులు ఉండగా, వీరిలో బ్యాంకర్ల రుణ లక్ష్యం కేవలం 33.85 లక్షల మంది రైతులు కావడం విశేషం. వీరిలో ఇంతవరకూ 8 లక్షల మందికే రుణాలు అందించాయి. మరోపక్క రుణ మాఫీ కాకపోవడంతో అన్నదాతలను బ్యాంకులు, సహకార సంఘాలు దోచు కుంటున్నాయి. పంట రుణాలకు సంబంధించిన బకాయిలకు ముక్కు పిండి మరీ వడ్డీలపై వడ్డీలు వసూలు చేస్తున్నాయి. అంతేకాకుండా వానాకాలం పెట్టుబడి నిమిత్తం ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు రైతు బంధు సొమ్ము విడుదల చేయగా, వాటిని సైతం పలు బ్యాంకులు బకాయిలకు జమ చేసుకున్నాయి. వాయిదా మీరిన బకాయిలు ఉన్నాయనే పేరుతో బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా రుణాల మాఫీ అమలు కాకపోవడంతో పంట రుణాల బకాయిల వసూళ్ల కోసం పలు వాణిజ్య బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతుల పరువు తీస్తున్నాయి. అసలు, వడ్డీలు కట్టక పోయినట్లయితే భూములు వేలం వేస్తామని, ఇంట్లో చెంబు, గిన్నెలు బయట పడేస్తామని బెదిరింపులకు సైతం పాల్పడుతూ రైతులను ఆగమాగం చేస్తున్నాయి. వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని చెప్పి మూడేళ్లు దాటినా ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 40.66 లక్షల మంది రైతులుకు రుణ మాఫీ కావాల్సి ఉండగా, 25 వేల రూపాయల లోపు 2.96 లక్షల మంది, 50 వేల రూపాయల లోపు దాదాపు 4.50 లక్షల మందికి మాత్రమే మాఫీ అయ్యాయి. ఇంకా 34 లక్షలమంది రైతులు పంటరుణాలు ఏళ్లతరబడి వాయిదా మీరినబకాయిలుగా మిగిలిపోయాయి. దీంతో ఏడాది దాటిన పంట రుణాలకు లక్ష రూపాయలకు నెలకు 1,500 రూపాయలుచొప్పున వడ్డీని వసూలు చేస్తున్నాయి. ఇదికాకుండా అదనంగా అపరాధవడ్డీ కింద మరో 3% మేర వసూలు చేస్తుండగా, సహకార సంఘాలు అయితే 3.5 శాతం నుండి 6 శాతం వరకూ ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి.

# ప్రపంచ దేశాలకు దిక్సూచి భారత్

### చైనాతో పోటీపడుతున్నా మన ప్రత్యేకతలు వేరే

### సైనికుల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో మంత్రి

### 3 వారాల తర్వాత బయటకు వచ్చిన మంత్రి కెటిఆర్



హైదరాబాద్‌లో ఆదివారం సైనికుల ఆజాదీకా అమృత్‌మహోత్సవ్‌లో పాల్గొన్న మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు14:** అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించిన భారత్... రానున్న రోజుల్లో ప్రపంచ దేశాలకు దిక్సూచిగా ఉంటుందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆకాంక్షించారు. విభిన్న మతాలు,కులాలు,సంప్రదాయాల కలయికగా ఉన్న భారత్‌లో... దేశభక్తి విషయంలో అంతా ఐక్యంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. దేశ,రాష్ట్ర ప్రజలకు 75వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కెటిఆర్... ప్రపంచ దేశాలతో భారత్‌ను పోల్చలేమని గొప్ప దేశమంటూ కొనియాడారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్ సైనికులు రెండు రోజుల పాటు నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలి నొప్పితో బాధపడుతున్న కెటిఆర్...3వారాలఅనంతరం ఈ కార్యక్రమానికి ≫2



# ఎన్నికల హామీలు తుంగలో తొక్కిన సిఎం కెసిఆర్

### తుర్కలషాపురం రచ్చబండలో బండి సంజయ్

**గుండాల (నల్లగొండ జిల్లా), ఆగస్టు 14 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సారథ్యంలో కొనసాగుతున్న పాదయాత్ర గుండాల మండలంలోని తుర్కలషాపురం గ్రామానికి ఆదివారం సాయంత్రం చేరుకుంది. ఈ సందర్భంగా రచ్చబండ కార్యక్రమం ≫2

### స్టాక్ గురు రాకేష్ ఝున్‌ఝున్‌వాలా

# కన్నుమూత



**ముంబై, ఆగస్టు 14:** భారత్ స్టాక్ గురు, ఇండియా వారెన్ బఫెట్‌గా పిలుచుకునే ఏస్ ఇన్వెస్టర్ రాకేష్‌ఝున్‌ఝున్‌వాలా తుదిశ్వాస విడిచారు. ముంబయిలోని ఒకఆసుపత్రిలో చికిత్స పొందుతూ 62వ ఏట కన్నుమూసారు. వారం రోజుల క్రితమే ఆయన తనసొంత విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్‌నుంచి మొట్టమొదటి విమానసర్వీసును కూడా ప్రారంభించారు. బ్రీచ్‌కాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాకేష్ ఆదివారం ఉదయం 6.45 గంటలకు గుండెపోటు తీవ్రస్థాయిలో రావడంతో చనిపోయినట్లు ఆసుపత్రి వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రికి వచ్చేటప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు ధృవీకరించారు. కొన్ని వారాలక్రితమే ఝున్‌ఝున్‌వాలాను ఇదే ఆసుపత్రి వైద్యులు కిడ్నీ సంబంధిత సమస్యలపై చికిత్సలు అందించి డిశ్చార్జిచేసారు. సాయంత్రమే ముంబయిలోని బాన్‌గంగా స్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఈక్విటీ మార్కెట్లలో ఏస్ ఇన్వెస్టర్‌గా ఉన్న రాకేష్‌ను దలాల్‌స్ట్రీట్ బిగ్‌బుల్‌గా పేర్కొంటుంటారు. ఆయన సంపద చనిపోయేనాటికి 5.8 బిలియన్ డాలర్లుగా ఉంది. భారత్‌లో ఉన్న బిలియనీర్లలో 36వ సంపన్నుడుగా ఆయన ఫోర్బ్స్ జాబితాలో నమోదయ్యారు. జెట్‌ఎయిర్‌వేస్ మాజీ సిఇఒ వినయ్ దూబే, మాజీ ఇండిగో హెడ్ ఆదిత్యఘోష్‌తో కలిసి ఆకాశ ఎయిర్‌ను ≫2

## 'స్వాతంత్ర్య' వేడుకలకు


# పాత యూనిఫామ్‌లే

### ఇప్పటికీ 40 శాతం స్కూల్స్‌కి చేరని యూనిఫామ్ దుస్తులు

### 5 శాతం విద్యార్థులకే ఒక జత యూనిఫామ్



**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది దేశంలో వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఈ నెల 8 నుంచి 22 వరకు వజ్రోత్సవ వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆగస్టు 15న జరిగే వజ్రోత్సవ వేడుకలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రం పాత యూనిఫామ్‌లతోనే హాజరు కానున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 2 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదివే విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోగా.. యూనిఫామ్స్ సైతం అందించ లలేదు. ఈ ఏడాది విద్యార్థులకు సరఫరా చేయాల్సిన కొత్త యూనిఫామ్‌లను ఇప్పటి వరకు విద్యార్థులకు పంపిణీ చేయకపోవడంతో పాత యూనిఫామ్‌తోనే పంద్రాగస్టుకు హాజరు కావల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో 26, 817 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 26 లక్షల మంది పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం రెండు జతల యూనిఫామ్స్‌ను ఇస్తుంది. వీరికి రెండు జతల యూనిఫామ్స్ కుట్టడానికి సుమారు 1.30 కోట్ల మీటర్ల బట్ట అవసరం ఉంటుంది. రాష్ట్రంలో ఎంత మంది విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తామనే ఇండెంట్‌ను పాఠశాల విద్య శాఖ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్‌కు పాఠశాలల ప్రారంభం కంటే 3, 4 నెలల ముందుగానే ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఇస్తేనే విద్యార్థుల యూనిఫామ్స్‌కు అవసరమైన బట్టను హ్యాండ్లూమ్స్ శాఖ జిల్లాల వారీగా పంపిణీ చేస్తుంది. జిల్లా నుంచి ఏ పాఠశాలకు ఎంత మేరకు అవసరమో అంత మేరకు పాఠశాలలకు చేరవేస్తారు. ఈ ఏడాది పాఠశాల విద్య శాఖ నుంచే హ్యాండ్లూమ్ శాఖకు ఇండెంట్ ఆలస్యంగా వెళ్లిందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇండెంట్ ఆలస్యం కావడంతోనే యూనిఫామ్ బట్ట పంపిణీ ఆలస్యం అయినట్టు సమాచారం. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్రంలోని 60 శాతం పాఠశాలలకు మాత్రమే విద్యార్థుల యూనిఫామ్‌కు అవసరమైన బట్టను సరఫరా చేసింది. మిగిలిన 40 శాతం మంది విద్యార్థులకు యూనిఫామ్స్ కోసం బట్టను సైతం ఇప్పటి వరకు పాఠశాలలకు అందించలేదు. ఇక వచ్చిన బట్టను యూనిఫామ్స్‌గా కుట్టి విద్యార్థులకు ఇచ్చారా? అంటే అది కూడా లేదు. యూనిఫామ్స్‌ను కుట్టడానికి ఒక్కో యూనిఫామ్‌కు రూ. 50 చొప్పున ఇస్తున్నారు. దీంతో యూనిఫామ్స్ కుట్టడానికి ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 60 శాతం స్కూల్స్‌కి బట్ట చేరినప్పటికీ 2 జతల యూనిఫామ్స్ కుట్టి విద్యార్థులకు అందించింది మాత్రం కేవలం 5 శాతం మాత్రమే. మరో 5 శాతం వరకు ఒక జత యూనిఫామ్ విద్యార్థులకు చేరింది. 40 శాతం పాఠశాలలకు ఇప్పటికీ యూనిఫామ్స్ కోసం బట్టను సరఫరా చేయలేదు. రాష్ట్రంలోని విద్యార్థులందరికీ దసరా పండుగకు కూడా రెండు జతల యూనిఫామ్స్ అందేలా పరిస్థితులు కనిపించడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభం కంటే ముందుగానే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవడంలో పాఠశాల విద్య శాఖ అధికారులు విఫలమయ్యారని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. టెండర్లను ఫైనల్ చేయడంలో అలసత్వం వహించడం వల్లనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన పిల్లలకు రెండు జతల యూనిఫామ్స్ అందేలా చర్యలు తీసుకోవాలని.. అందరు విద్యార్థులకు అన్ని పాఠ్యపుస్తకాలు అందించాలని సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.



## పంద్రాగస్టుకు

# మహమ్మారి వైరస్ ముప్పు

### గత 24 గంటల్లో 14,092కొత్తకేసులు 41 మంది మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశం 75వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఆజాదికా అమృత్‌మహోత్సవ్‌పేరిట భారీ ఎత్తున నిర్వహించుకుంటున్న సందర్భంలో కరోనా కేసులు పెరిగే ప్రమాదం కూడా లేకపోలేదని కేంద్రం రాష్ట్రాలను హెచ్చరించింది. ప్రత్యేకించి దేశరాజధాని న్యూఢిల్లీలో కరోనా పాజిటివిటీరేటు 17శాతానికి మించినమోదుకావడంతో అక్కడి యంత్రాంగం మరింత అప్రమత్తం అయింది. సుమారు ఏడువేలమందికిపైగా ఆహ్వానితులు వస్తున్న ఎర్రకోట వేడుకలకు పదివేలమందికిపైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో దేశంలో కరోనా కేసులుమళ్లీ ఉధృతమయ్యే ప్రమాదం ఉందని కేంద్రం అన్ని రాష్ట్రాలను అప్రమత్తంచేసింది. గడచిన 24 గంటల్లోకేసులు ముందురోజుకంటే తగ్గాయి. 14,092మందికి సోకి 41 మంది చనిపోయారు. క్రియాశీలకేసులు కూడా 2403 తగ్గి మొత్తంకేసులు 1,16,861కి చేరాయి. ఒక్కరోజులో రికవరీలు 16,454 వరకూ నమోదుకాగా మొత్తం రికవరీలు 4,36,09,566వరకూ ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఇక కేసులపరంగా ప్రస్తుతం 4,42,53,464 మందివరకూ ఉంటే మరణాలు 5,27,037వరకూ సంభవించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. రాష్ట్రాలవారీగాచూస్తే మహారాష్ట్రలో 2040 మందికిసోకి ఒకరుచనిపోగా కేరళలో 1081మందికిసోకి 12 మంది చనిపోయారు.

కర్ణాటకలో 1329 మందికిసోకి ఐదుగురు మృత్యువాతపడ్డారు. తమిళనాడులో 775 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 192, ఉత్తరప్రదేశ్‌లో 616 మందికిసోకి ఇద్దరు, పశ్చిమబెంగాల్‌లో 461 మందికిసోకి ముగ్గురు, ఢిల్లీలో 2031 మందికిసోకి తొమ్మిది మంది, ఒడిశాలో 403 మందికి కొత్తగా వైరస్‌సోకినట్లు తేలింది. రాజస్థాన్‌లో 537, గుజరాత్‌లో 565, ఛత్తీస్‌ఘర్‌లో 306, హర్యానాలో 864, బీహార్‌లో 127, తెలంగాణలో 440,పంజాబ్‌లో 274 మందికి సోకినట్లు తేలింది. ఇక జమ్ముకాశ్మీర్‌లో 622, ఉత్తరాఖండ్‌లో 255, హిమాచల్‌ప్రదేశ్‌లో 421, గోవాలో 158, మిజోరమ్‌లో 114 కొత్తకేసులు వెలుగులోకి వచ్చాయి. ఇక కరోనారికవరీరేటు 98.54శాతం కాగా మరణాలరేటు 1.19శాతంగా ఉంది. రోజువారి పాజిటివిటీరేటు 4.36శాతంగా ఉన్నట్లు కేంద్రంప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 207.71 కోట్ల కరోనా టీకాడోసులు వేసినట్లు వెల్లడించింది. వీటిలో సుమారు 3.97 కోట్ల డోసులు 12 నుంచి 14 ఏళ్లలోపువారికి వేసినట్లు వెల్లడి అయింది. ఏదిఏమైనా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా అన్ని రాష్ట్రాలు స్థానికంగా కట్టుదిట్టమైన కరోనా నిబంధనలు అమలుచేయాలని కేంద్రం ఆదేశాలు జారీచేసింది.

### విమర్శలు కాదు మునుగోడుపై

# ఫోకస్ పెట్టండి

### టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 14 ప్రభాత వార్త:** రాష్ట్రంలో మునుగోడు ఉప ఎన్నికపై కాకుండా వ్యక్తిగత విమర్శలు దృష్టి మళ్లుతుండడంతో ఆ నియోజక వర్గ ప్రజలకు తీవ్ర నష్ట వాటిల్లుతుందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిత్యావసర ధరల పెరుగుదల వల్ల పేదలపై పడుతున్న భారం మీద చర్చ జరగాలన్నారు. మునుగోడు ఉప ఎన్నిక అంశంపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఒక వీడియోను విడుదల చేశారు. మునుగోడు ప్రజలను మోసం చేసేందుకు బిజెపి, టిఆర్ఎస్ మరోసారి కుటిల రాజకీయాలు ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా వ్యక్తిగత దూషణలు, వివాదాలు చేస్తూ రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. బిజెపి ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేదన్నారు. నల్లధనం విదేశాల నుంచి తెచ్చి ప్రతిపౌరుడు ఖాతాలో రూ.15లక్షల రూపాయలు జమ చేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు అది చేయలేదన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ≫2

# వానాకాలంలో ముందుకు సాగని సాగు

### గత ఏడాది కంటే తగ్గిన 14 లక్షల ఎకరాలు

### పంటలన్నీ కలిపి 89.89 లక్షల ఎకరాలకే పరిమితం

### తలకిందులైన వ్యవసాయ శాఖ అంచనాలు



**హైదరాబాద్, అగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత వానాకాలం సాగు ఆశాజనకంగా లేదు. రాష్ట్రంలో వర్షాలు విస్తృతంగా కురిసినా పంటల సాగు మాత్రం ముందుకు సాగడం లేదు. గత ఏడాది కంటే ఈ వానాకలంలో పంటల సాగు విస్తీర్ణం 14 లక్షల ఎకరాలకు తగ్గింది. ప్రధానమైన వరి, పత్తితో పాటు, పప్పుధాన్యాల సాగుదీ అదే పరిస్థితి ఏర్పడింది. ప్రధాన పంటల సాగుపై వ్యవసాయ శాఖ వేసిన అంచనాలన్నీ తారుమారయ్యాయి. ప్రస్తుత వానాకాలం సీజనుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంటలూ కలిపి మొత్తం 1.53 కోట్ల ఎకరాల మేర సాగు చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఇందులో 11.34 లక్షల ఎకరాలు ఉద్యాన పంటలు సాగు చేయాలని నిర్దేశించింది. మిగిలిన 1.42 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో ప్రధానంగా పత్తి, కంది, మినుము వంటి పప్పుధాన్యాల సాగును భారీగా చేపట్టాలని భావించి అందుకు అనుగుణంగా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అయితే సాగు సమయం ముగుస్తున్నా ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 73 శాతం మేర 89.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగై అంచనాలన్నీ తల్లకిందులయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి అన్ని పంటలూ కలిపి 1.04 లక్షల ఎకరాలో సాగవ్వగా, దాని కన్నా ప్రస్తుత సీజనులో 13 లక్షల ఎకరాల విస్తీర్ణం తక్కువ కావడం గమన్హాం. ఈ సీజనులో సింహభాగంగా పత్తి 70 నుండి 75 లక్షల ఎకరాల వరకూ సాగు చేయాలని రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. అయితే ఇంత వరకూ 47.60 లక్షల ఎకరాలకే పరిమితమై గత ఏడాది కన్నా 3 లక్షల ఎకరాలకు తగ్గడం విశేషం. ఇక మరో ప్రధాన మైన వరి పంట విషయానికి వస్తే ఈ సారి 50 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని లెక్క వేసినా, ఇప్పటి వరకూ 23.91 లక్షల ఎకరాలలోనే నాట్లు పడ్డాయి. గత ఏడాది 32.28 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక కంది, పెసర, మినుము తదితర పప్పుధాన్యాల సాధారణ విస్తీర్ణం 10.36 లక్షల ఎకరాలు కాగా ఇంత వరకూ 6.26 లక్షల ఎకరాల్లో విత్తగా, గత ఏడాది 10.45 లక్షల ఎకరాల్లో సాగైన దాని కంటే 4 లక్షల ఎకరాలు తగ్గడం అధికారులకు అయోమయానికి గురి చేస్తోంది. అలాగే వేరుశెనగ, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి ఆయిల్ పంటను కూడా భారీగా సాగు చేయాలని వ్యవసాయ శాఖ, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించే ప్రయత్నం చేసినా ఇక్కడ కూడా నిరాశే ఎదురైంది.

# చైతన్యశీల నవ భారతానికి యువత కృషి చేయాలి

- 75 యేళ్ల దేశాభివృద్ధిని చూసి ప్రతిఒక్కరూ గర్వించాలి
- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు



**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** చైతన్యశీలమైన, వివక్ష రహితమైన ప్రపంచానికే ఆదర్శమైన నవ భారతాన్ని నిర్మించేందుకు భారతీయ యువత సమిష్టిగా కృషి చేయాలని భారతదేశ పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవాల నేపథ్యంలో ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ( హర్ ఘర్ తిరంగా) కార్యక్రమ ప్రచారాన్ని పురస్కరించుకుని ముచ్చింతల్‌లో ఉన్న స్వర్ణభారతి ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్ లో శిక్షకులు, విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక ఆర్థిక అసమానతలు లింగ వివక్ష వంటి సవాళ్లను అధిగమించే దిశగా సానుకూల మార్గంలో పోరాటం చేయాలని దేశాభివృద్ధిని వేగవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. భారతదేశ అభివృద్ధి గాథలో యువత మరియు గ్రామ పాల్గొనాలని స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చుకునే దిశగా కృషి చేయాలని వెంకయ్యనాయుడు సూచించారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలోని ముఖ్య ఘట్టాలను యువతకు గుర్తు చేసిన పూర్వ ఉప రాష్ట్రపతి స్వరాజ్య అమృతోత్సవాల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారిని దేశ వ్యాప్తంగా జాతీయ వాద స్ఫూర్తిని ఇనుమడింపజేసిందని తెలిపారు. స్వరాజ్యాన్ని సముపార్జించుకుని 75 ఏళ్ల మైలు రాయిని ఉత్సవాలుగా నిర్వహించుకుంటున్న తరుణంలో ప్రపంచ యవనికపై భారతదేశ విజయాలను చూసి ప్రతి ఒక్కరూ గర్వపడాలని సూచించారు. దేశాభివృద్ధిని చూసి గర్విస్తున్నామన్న ఆయన భారతదేశ రైతులు, సైనికులు, శాస్త్రవేత్తలు వైద్యులు పరిశోధకులు, పారిశ్రామిక వేత్తలు ఇంజనీర్లు విద్యావేత్తలు వంటి అన్నిరంగాల ప్రజల విజయాల పట్ల మనం గర్వించాలని తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రింట్ మరియు మీడియా నెట్‌వర్క్‌లో భాగంగా స్వేచ్ఛా మరియు స్వతంత్ర మీడియాను కలిగి ఉండడం ఆనందదాయకమన్నారు. కొవిడ్ మహమ్మారి సమయంలో అనేక సవాళ్లను అధిగమిస్తూ దేశం గర్వించే విధంగా రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి చేసిన రైతు కృషి,రికార్డు సమయంలో వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేయడమే కాకుండా 90 దేశాలకు పైగా పెంచిన ప్రజలకు సరఫరా చేయటం కొన్ని దేశాలకు ఉచితంగా అందించడం గర్వకారణమని తెలిపారు. ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల నుంచి వీర నారీమణుల నుంచి యువత స్ఫూర్తి పొందాలని ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. పంచాయితీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకూ ఎన్నికలు జరిగే ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమన్న ఆయన ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అభివృద్ధి గమనంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. అతి పెద్ద టెలికాం నెట్‌వర్క్‌గా గ్రామీణ ప్రాంతాలను సైతం కలిపే విధంగా ఏర్పాటు చేసిన రవాణా వ్యవస్థలతో దేశం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. దేశాభివృద్ధికి ఆటంకంగా దేశంలో అక్కడక్కడా నెలకొన్న వివక్షలను, అవినీతిని పేదరికాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య అధికార ప్రతిపక్షాల మధ్య సహకారం , సమన్వయం మరింత అవసరమని తెలిపారు. ప్రజాజీవితంలో నైతికత విలువల క్షీణతను సమర్థవంతంగా అరికట్టాలని ఆయన దేశ పౌరులకు పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవన శైలి మీద దృష్టి పెట్టాలన్న ఆయన నిత్యం వ్యాయామం చేయడం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం చేయాలని సూచించారు. ఆరోగ్యాన్ని పాడు చేసే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ యోగా లాంటి వాటిని జీవనంలో భాగంగా చేసుకోవాలని ప్రకృతిని ప్రేమిస్తూ ప్రకృతితో కలిసి జీవించాలని దిశా నిర్దేశం చేశారు. భాగస్వామ్యం సంరక్షణ భారతీయ సంస్కృతిలో మూల భాగమని గుర్తు చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సహకారం అందించేందుకు యువత చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారతి ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్ , హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి సుబ్బారెడ్డి, ట్రస్ట్ నిర్వహణా సిబ్బంది, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 16 మంది పోలీసులకు పంద్రాగస్టు పతకాలు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో విశేషంగా కృషి చేసినందుకు పంద్రాగస్టు నాడు కేంద్రం ప్రకటించే పిపిఎం, ఐపిఎంలు ఈసారి రాష్ట్రం నుంచి 16 మంది పోలీసు అధికారులకు దక్కాయి. ఈ మేరకు డిజిపి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో రాచకొండ సిపి మహేష్ భగవత్‌తో పాటు సిఐ సెల్‌లో నాన్ కేడర్ ఎస్పిగా వున్న దేవేందర్ సింగ్‌కు ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పోలీసు పతకం (పిపిఎం) లభించింది. వీరితో పాటు నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్)గా వున్న అమ్మిరెడ్డి రామచంద్ర శ్రీనివాస్ (ఏ.ఆర్ శ్రీనివాస్), సిఐడి అదనపు ఎస్పి పాలేరు సత్యనారాయణ, ఎసిబి అదనపు ఎస్పి పై లా శ్రీనివాస్, సిటీ ఎస్‌బిలో ఎసిపిగా వున్న సాయిని శ్రీనివాసరావు, ఖమ్మం ఎసిబిలో డిఎస్‌పిగా వున్న సురద వెంకటరమణ మూర్తి, సిటీ సిఎస్ డబ్ల్యులో డిఎస్‌పిగా వున్న చెరుకు వాసుదేవ రెడ్డి, పోలీసు అకాడమిలో డిఎస్‌పిగా వున్న గంగిరెడ్డి గురు రాఘవేంద్ర, రామగుండం ఎస్‌బిలో ఎసిఐగా వున్న చిప్ప రాజమౌళి, రాచకొండ ఎస్‌బిలో ఎఎస్‌ఐగా వున్న శ్రీనివాస్, కామారెడ్డి సాయుధ బలగంలో ఎఎస్‌ఐగా వున్న నీలం రెడ్డి, వరంగల్‌లోని టిఎస్ఎస్‌పి నాలుగవ బెటాలియన్ ఎస్‌ఐ సుధాకర్, కరీం నగర్ ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌లకు ఐపిఎంలు లభించాయి. కాగా పతకాలు సాధించిన వారిని డిజిపి మహేందర్ రెడ్డి అభినందించారు.

## విద్యుత్ సవరణ బిల్లును ఒప్పుకొనేదే లేదు

### జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థల సిఎండి డి ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లు వల్ల విద్యుత్ సంస్థలకు తీవ్ర నష్టాలు వస్తాయన్నారు. ఇప్పటికే ఈ విద్యుత్ సవరణ బిల్లును ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకించారని చెప్పారు. అంతేకాకుండా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని తెలిపారు. త్వరలో విద్యుత్ ఉద్యోగులకు తీపి కబురు అందిస్తామని పేర్కొన్నారు. విద్యుత్ శాఖలో వేతనాల విషయంలో ఇప్పటికే పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)కు సంబంధించిన కమిటీని వేశామని చెప్పారు. దీనిపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. కాగా జల విద్యుత్‌ను పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేస్తామని వెల్లడించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ సంస్థలకు భారీగా నష్టాలు వాటిల్లాయని వివరించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో ఎక్కువగా నష్టం జరిగిందని, ఉద్యోగులు, సిబ్బంది కష్టించి విద్యుత్‌ను పునరుద్ధరించారని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేస్తామని తెలియచేశారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల అర్హతల్లో మార్పులు

### కనీస విద్యార్హత ఇంటర్‌కు పెంపు
### వయోపరిమితి 21 నుండి 18 యేళ్లకు తగ్గింపు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ ఉద్యోగుల భర్తీకి సంబంధించి వివిధ అర్హతలను మార్చుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా విద్య, వయస్సు తదితర అర్హతల్లో మార్పులు చేసింది. విద్యా అర్హతలను పెంచడంతోపాటు, వయోపరిమితిని తగ్గించింది. ఇప్పటి వరకూ 10వ తరగతి విద్యార్హత ఆధారంగా అంగన్వాడీ టీచర్, వర్కర్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. అయితే కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు ఇక నుండి ఇంటర్ విద్యార్హత తప్పనిసరిగా ఉండేలా మార్పు చేసింది. అలాగే వయోపరిమితికి సంబంధించి ఇంత వరకూ కనీసం 21 సంవత్సరాలు ఉండాలన్న నిబంధన ఉంది. అలాగే 35 ఏళ్ల వయస్సు వరకూ గరిష్ట వయోపరిమితికి అవకాశం ఉంది. అయితే మారిన అర్హతల ప్రకారం ఇక నుండి కనీస వయోపరిమితిని 18 ఏళ్లకు తగ్గించింది. కాగా ఇక అంగన్వాడీ ఉద్యోగాల్లోని వారికి ఇంత వరకూ పదవీ విరమణ వయస్సు అనేది లేకుండా ఉంది. ఇక నుండి 65 ఏళ్ల వయస్సు మించకుండా ఉండాలని స్పష్టం చేసింది. పదవీ విరమణ వయస్సు విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, అయితే ఇది 65 ఏళ్లకు మించకుండా చూసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా అంగన్వాడీ టీచర్ల నియామకాల్లో సగం ఉద్యోగాలను ఆయాలుగా ఐదేళ్ల పాటు పనిచేసిన వారితో భర్తీ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా అంగన్వాడీ సూపర్ వైజర్ పోస్టులకు సంబంధించి భర్తీ చేసే సమయంలో 50 శాతం పోస్టులను ఐదేళ్ల పాటు అనుభవం ఉన్న టీచర్లతో భర్తీ చేసేలా మార్పులు తీసుకువచ్చింది. అంగన్వాడీ ఉద్యోగులను పార్ట్ టైమ్ ఉద్యోగులా పరిగణిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## బడుగులు సర్దార్ సిద్ధాంతాలను పాటించడమే నిజమైన నివాళులు

- సర్వాయి పాపన్న 372వ

### జయంత్యుత్సవాల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 14, ప్రభాతవార్త :** సర్దార్ సర్వాయి పాపన్న కేవలం గౌడ కులస్తులకే కాకుండా బడుగుల అభ్యున్నతి కోరుకొన్న ఛత్రపతి శివాజీకి సమకాలి కుడని, బిసిలు బాగా చదువుకొని ఉన్నత విద్యావంతులై అన్నిరంగాల్లో అభ్యున్నతి సాధించి పాపన్న ఆశయాలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లిననాడే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని సాంస్కృతిక, పర్యాట, క్రీడా, ఆబ్కారీ శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోడీ పార్లమెంటులో బిల్లుతెచ్చి బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలే తప్ప రాష్ట్రాల్లో ఉన్న బిజెపియేతర ప్రభుత్వాలను కూలగొట్టి తమ ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోవాలన్న కాంక్ష వదులుకోవాలని హితవు పలికారు. తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ బిసి సంక్షేమ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న 372వ జయంతి ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులతో కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. పాపన్న ఆనాటి కాకతీయ, మొఘల్, నిజాంరాజులను ఎదురించి గోల్కొండ కోటతోపాటు 33 కోటల్లో తన రాజ్యాన్ని విస్తరించినా మన చరిత్రలో ఆయన పేరు నమోదు కాలేదన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షోపన్యాసంలో పాపన్న జీవించినంతకాలం పేద బడుగు బలహీన బహుజనుల కోసం పోరాడారని, ఆయన బహుజన దృక్పథం మెండుగా ఉన్న నాయకుడని కొనియాడారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జూలూరు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

### తెలుగు విశ్వవిద్యాలయంలో
### తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ..

తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు, పిసిసి అధికార ప్రతినిధి కె.నాగ రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శి ఎం.భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు తదితరులతో కలిసి తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం ఉదయం పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలితో ఘననివాళులర్పించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు పాపన్న చరిత్రను తొక్కిపట్టాలని ఎంతగా ప్రయత్నించినా చరిత్ర దాగదన్నారు. పాపన్న తెలంగాణ శివాజీ అభివర్ణిస్తూ ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్ పెట్టాలని, పాపన్న జీవిత చరిత్రను పదవ తరగతి పాఠ్యాంశాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.

## వ్యవసాయ మంత్రి పేరుతో బురిడీ!

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి ఎస్ నిరంజన్ రెడ్డి పేరుతో వాట్సాప్ ద్వారా చెలామణీ అవుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. మంత్రి నిరంజన్‌రెడ్డి పేరుతో వాట్సాప్‌లో ఛాటింగ్ చేస్తున్నట్లు గుర్తించి ఒక వ్యక్తిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిరంజన్‌రెడ్డి ఫొటోను వాట్సాప్ డిస్‌ప్లే పిక్చర్‌గా పెట్టుకుని పలవురు అధికారులతో ఛాటింగ్ చేస్తున్నట్లు బయటపడింది. తాను మంత్రినంటూ పలువురు అధికారులతో ఛాటింగ్ చేస్తూ వారిని బురిడీ కొట్టించే ప్రయత్నం చేసినట్లు తెలియవచ్చింది. ఈ వ్యవహారంపై సదరు మంత్రి పిఆర్వో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు.

## పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కరోనా పాజిటివ్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కరోనా పాజిటీవ్‌గా నిర్ధారణ అయింది. శనివారం నుంచి అనారోగ్యంతో పాటు కొవిడ్ లక్షణాలపై అనుమానం రావడంతో నమూనాలను పరీక్షలకు పంపించారు. పరీక్షల్లో ఆయనకు కరోనా నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సెల్ఫ్ క్వారైంటైన్‌లో ఉన్నారు. కరోనా నిర్ధారణ కావడంతో తనను కలిసిన వారందరూ టెస్టులు చేయించు కోవాలని సూచించారు. తనకు కరోనా సోకినట్లు ట్విట్టర్‌లో వెల్లడించారు. టెస్ట్ రిపోర్టును ట్విట్టర్‌లో పోస్టు చేశారు. కరోనా లక్షణాలు బయటపడడంతో ఏఐసిసి పిలుపుమేరకు ఆజాదీకా గౌవర్ యాత్రలో భాగంగా మునుగోడులో నియోజకవర్గంలో చేపట్టాల్సిన పాదయాత్రను రద్దుచేసుకున్నారు.



## స్వేచ్ఛా వాయువులకు కారణం కాంగ్రెస్ పార్టీ

### పిసిసి ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** దేశంలో ఈ స్వేచ్ఛా వాయువులకు కారణం కేవలం కాంగ్రెస్ పార్టీ అని టిపిసిసి ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. భారతదేశంలో 75 వసంతాల స్వతంత్ర ఉత్సవాల సందర్భంగా నగరంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహాల్, కోఠి ప్రాంతాలలో ఉన్న స్వతంత్ర సమరయోధుల స్థూపం నుంచి పాదయాత్రను ప్రారంభించి అబిడ్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందన్నారు. ఎంతో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు.

## ప్రశ్నించే తత్వం నుంచి బానిసత్వానికి తెచ్చిన ఘనత కెసిఆర్‌దే!: ఎమ్మెల్యే ఈటల

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 14, ప్రభాతవార్త:** తెలంగాణ సమాజాన్ని ప్రశ్నించే తత్వం నుంచి బానిసత్వానికి తెచ్చిన ఘనత కెసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ ఆత్మగౌరవాన్ని కోల్పోరు అని, ప్రస్తుత పాలకులు ఆనాడు ఉండి ఉంటే మనం ఉద్యమం చేసేవాళ్లం కాదమెననే అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ ఉద్యమ కారులను సత్కరించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఏ సంఘాలు తెలంగాణ కోసం కొట్లాడా మో వాటిని ఉండడానికి వీలులేదని ఫత్వాలు విడుదల చేశారని, ఉద్యమం కోసం ఎక్కడైతే కూర్చుని కొట్లాడామో ఆ ఇందిరాపార్కును కూడా ఎత్తివేసిన పరిస్థితి టిఆర్ఎస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమైందని ఎద్దేవా చేశారు. ఇందిరాపార్కు లేకపోతే మనకు కూడా బతుకు లేదని, ఇప్పుడు వారు తెలుసుకున్నారని, అందుకే అక్కడ పాలకులు కూడా ధర్నా చేశారని అన్నారు. ఆనాడు ఉద్యమంలో ఏకమైన సంఘాలన్నింటిని నేటి ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని, ఆనాడు మనకు జెండాలు, పార్టీలు, కులం మతంతో సంబంధం లేదని, ఆనాటి ఉద్యమానికి అంకితభావం, త్యాగం ఉందని,, ఉద్యమకారుల గురించి గడిచిన 8 ఏళ్లలో ఏనాడు పట్టించుకున్న పాపానపోలేదని, ఉద్యమకారులను ఆర్థికపరంగా కాకుండా గుర్తింపు గౌరవం కూడా ఇవ్వాలని, అవి రెండు ఈనాడు లేవని అన్నారు. ఆనాడు ఉద్యమంలో తెలంగాణ ఉద్యమకారులను, మనల్ని అవమానించినవారే వారు నేడు పదవులు అనుభవిస్తున్నారని అన్నారు. ఇటువంటి టిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మనందరి కర్తవ్యం ఒక్కటే దోపిడీ, దుర్మార్గానికి వ్యతిరేకంగా ఏకం కావడం మొక్కటే మార్గమని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షలు తిరిగి నెరవేరాలంటే మలిదశ ఉద్యమం రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ వస్తే ఎస్సీ,ఎస్టీ, బీసీలు బాగుపడుతారని అనుకున్నామని, కాని ఈ వర్గాలు మరింత దుర్భరస్థిలోకి నెట్టబడ్డారని ఆందోళన వ్యక్తంచేశారు. 8 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో ఎక్కడా న్యాయం జరగలేదని, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం చేసిందేమిలేదిని, 2లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన చెప్పిన 80వేల ఉద్యోగాలు కూడా నేటికి భర్తీ చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అన్నివ్యవస్థలను, రంగాలను నిర్వీర్యంచేసిందని, ఏ రంగానికి కూడా న్యాయం చేయలేని దౌర్భాగ్యస్థితిలో కెసిఆర్ ప్రభుత్వం ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఎటువంటి ఆందోళన చేపట్టినా తన వంతు సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి మనం కాపాడాలని, ఆనాడు ఏకం అయిన మనలో ఉన్న ఆ స్ఫూర్తి ఈనాడు ఏమైందని ప్రశ్నించారు. ఈనాడు ఇంకా ఉద్యోగాలు అడ్డుక్కునే పరిస్థితిలో ఉన్నామని, తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బంధీ అయిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేత చెరుకు సుధాకర్, మాజీ ఎమ్మెల్సీలు రాములు నాయక్, దిలీప్‌కుమార్, తెలంగాణ జేఏసీ చైర్మన్ కోలా జనార్ధన్, టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర నేత వేముల మారయ్య, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కాచం సత్యనారాయణగుప్త, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం అధినేత పల్లెరవికుమార్ గౌడ్, ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ళ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొంతం వీరస్వామి, గుర్జని వెంకటేశం గౌడ్, కారింగుల నరేందర్‌గౌడ్, సింగారం రవీందర్, పల్లె నర్సింహాగౌడ్, జెనిగె విష్ణువర్ధన్, ఇంద్రకుమార్, కొంతం యాదగిరిరెడ్డి(ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు), తోట మోహన్, జంగా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

### మలిదశ ఉద్యమానికి సన్నద్ధం కావాలి: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## కాంగ్రెస్‌లోచల్లారని లుకలుకలు

### మెట్టు దిగని కోమటిరెడ్డి
### రేవంత్ క్షమాపణ చెప్పినా.. ససేమిరా


**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నిక కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది. నేతల మద్య మాటలు, అలకలు కొనసాగుతున్నాయి. మునుగోడు ఉప ఎన్నిక విషయంలో ఐక్యంగా ఉండాలంటూ అధిష్టానం పదేపదే ఆదేశిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. చుండూరు సభ విషయంలో భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ బహిరంగంగా తిట్టారు. ఈ వ్యవహారం ఇంకా కొనసాగుతూనే ఉంది. కాంగ్రెస్ అద్దంకి దయాకర్ తిట్టిన వ్యవహారంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి క్షమాపణలుచెప్పారు. అదేవిధంగా అద్దంకి దయాకర్‌సైతం క్షమాపలు చెప్పారు. కానీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారు.
అద్దంకి దయాకర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. అయితే అద్దంకి దయాకర్‌పై బెట్టువీడకపోవడంతో కాంగ్రెస్‌లోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఇంట్లో మల్లురవి, బెల్లయ్యనాయక్, చరణ్‌కౌశిక్‌లు భేటి అయ్యారు. క్షమాపణలు చెప్పినప్పటికీ అసంతృప్తి వ్యక్తం చేయడంతోపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు అధిష్టానం కలిసికట్టుగా మునుగోడుపై దృష్టిసారించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయినా నేతలు మాత్రం ఉప ఎన్నికలను పక్కకు పెట్టారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మునుగోడు స్థానం సైతం చేజారడం ఖాయం.

## టిఆర్ఎస్ నాయకులు, మంత్రులను తరిమికొట్టే రోజులు దగ్గరలోనే

### బిజెపి రాష్ట్ర నాయకుడు విక్రమ్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** తెలంగాణాలో టిఆర్ఎస్ నాయకులు, మం త్రులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బిజెపి రాష్ట్ర నాయకులు విక్రమ్‌గౌడ్ మండిపడ్డారు. అవినీతికిపాల్పడి రెండుసార్లు ఎసిబికి అడ్డంగా దొరికిపోయిన వ్యక్తి, నేడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లో తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గాల్లో కాల్పులు జరపడంపై బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ స్పందిస్తూ మంత్రిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈ విషయంపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం నగరంలో ఒక కార్యక్రమంలో పాల్గొని డికె అరుణపై పలు ఆరోపణలు చేశారన్నారు.
మంత్రి చేసిన వ్యాఖ్యలను విక్రమ్‌గౌడ్ మండిపడ్డారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణపై మాట్లాడే స్థాయి అర్హత లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్గౌడ్ ఏమి చేశారో అందరికి తెలుసునన్నారు. ఏసిబి కేసులో సస్పెన్షన్ ఎత్తివేత కోసం ఎన్ని గడపలు తొక్కిన సంగతి గుర్తుంచుకుంటే మందిదన్నారు. తెలంగాణ ఉద్యమంలో డికె అరుణ ఎక్కడ ఉందో రాష్ట్ర ప్రజలందరికి తెలుసునన్నారు. ఎంత మంది ఉద్యమకారులకు సమాయ సాకారాలు అందించిందో వారిని అడిగి తెలుసుకోమని విక్రమ్‌గౌడ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సూచించారు. ఉద్యమకారులను దూరం బెట్టి, ద్రోహులను పక్కను పెట్టుకుని ముఖ్యమంత్రి చేస్తున్న మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.
సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. మంత్రి తన వ్యక్తిగత అవసరా లను ఉద్యమంలో ఉద్యోగ సంఘం పేరు చెప్పి పబ్బం గడుపుకున్నట్లు, ఇప్పుడు కులం పేరును వాడుకోవద్దన్నారు. విక్రమ్‌గౌడ్‌తో పాటు మహ బూబ్‌నగర్ జిల్లా ఎస్పిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## ఏ చట్ట ప్రకారం మంత్రి గాల్లో కాల్పులు జరిపారు



- పిఎస్‌ఓ వద్దే రబ్బరు బుల్లెట్లు ఉంటే ఎమ్మెల్యేలంతా ఆలోచించాలి
- మంత్రిపై చర్యలు తీసుకోకుంటే హైకోర్టులో పిల్ వేస్తా
- బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త :** మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను వెంటనే తొలగించాలని బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఏ చట్టం ప్రకారం మంత్రి గాల్లోకి కాల్పులు జరిపా రంటూ ప్రశ్నించారు. ఆదివారం బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రఘు నందన్ రావు మాట్లాడారు. పర్సనల్ సెక్యూరిటీ నుంచి తుపాకి తీసి కాల్చడమేమిటని ప్రశ్నించారు. మంత్రికేమైనా గన్‌లైసెన్సు ఉందా అంటూ నిలదీశారు. ప్రాణహాని ఉందంటూ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రభుత్వ ప్రత్యేక భద్రత కల్పించిందని, అలాంటి వ్యక్తి పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ వద్దే రబ్బరు బుల్లెట్లు ఉంటే ఎమ్మెల్యేలు అంతా ఆలోచించుకోవాలన్నారు. తమకు భద్రతగా ఉన్న గన్‌మెన్ల వద్ద ఉన్నవి రబ్బరు బులెట్ల అంటూ నిలదీశారు. ఒరిజినల్ బుల్లెట్లు కావా అన్నారు. దీనిపై డిజిపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
బహిరంగ ప్రదేశాలలో తుపాకి కాల్చడం చట్టరీత్యా నేరం అన్నారు. ఈ విషయంలో డిజిపి మూడు తప్పులు చేశారన్నారు. ఎస్పి సమక్షంలో తుపాకి పేలిస్తే దాన్ని ఇప్పటి వరకు సీజ్ చేయలేదన్నారు. మంత్రిపై కేసు నమోదు చేసే అవకాశమున్న పెట్టలేదన్నారు. ఆ తుపాకిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపలేదన్నారు. ఎస్పిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారా? రిటైర్ అయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవి కోసం డిజిపి ఆలోచిస్తున్నారా? అన్నారు. దేని కోసం మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయంపై మాట్లాడేందుకు డిజిపి కార్యాలయానికి ఎప్పుడు రమ్మంటారు? డిజిపి నిజాయితీ వ్యవహరించి తుపాకిని ఫోరెన్సిక్ పంపించాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, విచారణ నిష్పక్షపాతంగా జరగా లంటే మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మంత్రి పదవి నుంచి తప్పించాలన్నారు.
మంత్రి మీద నమ్మకం ఉంటే రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ మంత్రిపై డిజిపి చర్యలు తీసుకోకుంటే తానే హైకోర్టులో పిల్ వేస్తానని స్పష్టం చేశారు.

## అన్నివర్గాల సమైక్య కృషితోనే జాతీయ నిర్మాణం సుసాధ్యం

### దక్షిణ భారత లెఫ్టినెంట్ జనరల్ అరుణ్



సభలో ప్రసంగిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ఎ.అరుణ్, ఉదయశంకర్, మామిడి హరికృష్ణ, మూర్తి తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 14, ప్రభాతవార్త:** నేటి యువత ఇక్కడ వివిధ విద్యల నభ్యసించి, అత్యున్న విద్యకోసం విదేశాలకువెళ్లి విజ్ఞానం, పరిజ్ఞానం, ధనం, పేరుప్రఖ్యాతులు సాధించినా దాన్ని మాతృదేశ అభ్యు న్నతికి పెట్టుబడిపెట్టి దేశాన్ని ప్రపంచపటంలో అత్యున్నతస్థాయిలో నిలిపే బాధ్యత యువతరానిదేనన్న దక్షిణ భారత లెఫ్టినెంట్ జనరల్ అరుణ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, ఆకాశవాణి హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్, 75 వసంతరాల స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల ద్విసప్తాహ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన వసుధైక కుటుంబీకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొగి మామిడి హరికృష్ణ, వి.ఉదయశంకర్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేశారు. భారతదేశం నేడు స్వాతంత్ర్య వజ్రోత్సవాలను జరుపుకోవడం ఎంతో శుభకరమన్నారు.

## రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్ ఆగస్టు 14:** భారత 76వ స్వాతంత్ర్య దినోత్స వం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. 76వ స్వాతంత్ర్య దినోత్సవం మన దేశచరిత్రలో ఒక చిరస్మరణీయమైన రోజని గవర్నర్ అభివర్ణించారు. స్వాతంత్ర్యం సాధించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న దృష్ట్యా ఆజాది కా అమృత్ మహోత్సవాల పేరుతో దేశమంతా వేడుకలు జరుపు కుంటు న్నారని సౌందరరాజన్ తెలిపారు. లెక్కలేనన్ని త్యాగాలు, అవిశ్రాంత పోరాటాల తర్వాత మనం వలస పాలన నుంచి విముక్తి పొంది స్వాతంత్ర్యం సాధించామని గుర్తు చేశారు. ఇలాంటి చారిత్రాత్మక ఘటనల సమయంలో మన జాతీయ జెండా, త్రివర్ణపతాకం పట్ల గౌరవాన్ని ప్రదర్శించడం మన కర్తవ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఆత్మనిర్భర్ భారత్ నిజమైన స్ఫూర్తితో భారతదేశాన్ని అన్ని అంశాలలో బలమైన, సురక్షితమైన, స్వావలంబనంగా మార్చాలని సంకల్పిద్దామన్నారు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం అన్ని రంగాలలో అపారమైన పురోగతిని సాధించిందని, ప్రస్తుతం మనం దాని ప్రయో జనాలను పొందుతున్నామన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

**వేములవాడ, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజ రాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆది వారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్య లో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణాలన్నీ కిటకిటలాడాయి. భక్తులు మొక్కులు తీర్చుకొని క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.దాదాపు 30వేల పైచిలుకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇఒ రమాదేవి సూచనలతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# సందర్శకులతో హోరెత్తిన ట్యాంక్‌బండ్, చార్మినార్

### వర్షంలోనూ తగ్గని జనసందోహం

**హైదరాబాద్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందుతున్న ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం వేళ సందర్శకుల రద్దీని దృష్టిలో వుంచుకుని బల్దియా ఆధ్వర్యంలో జరిగిన సన్‌డే ఫన్ డే సందర్శకులతో హోరెత్తింది. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వ రకు జరిగిన ఈ కార్యక్రమం సందర్శకులను అలరించింది. సన్‌డే ఫన్ డే పురస్కరించుకుని సాయంత్రం నాలుగు గంటల నుంచే అన్ని రకాల వాహనాలను పోలీసులు నిషేధించడం తెలిసిందే. మధ్యాహ్నం మూడు గంటల సమయంలోనే శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు అప్పర్ ట్యాంక్‌బండ్, లోయర్ ట్యాంక్‌బండ్ మార్గాలలో పెద్ద సంఖ్యలో రంగంలో దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై వాహనాలను నిషేధించి కేవలం పాదచారులకు మాత్రమే అనుమతులు ఇవ్వడంతో వేల సంఖ్యలో ప్రజలు ట్యాంక్‌బండ్ అందాలను తిలకించేందుకు విచ్చేశారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై వాహనాలను నిలిపివేయడం, ప్రజలు ఒక్కసారిగా తరలి రావడం, వ ర్షాన్ని సైతం లెక్క చేయకుండా జనం రావడంతో ఆ ప్రాంతమంతా జాతరను తలపించి, సందోహంగా మారింది. నిత్యం వాహనాల హంగామా, చప్పుళ్లతో హోరెత్తిపోయే ట్యాంక్‌బండ్‌పై ఈ తరహా దృశ్యం వీనులవిందు కలిగించింది. గత ఏడాది ఇదే ఆగస్టు నెలలో కొన్ని వారాల పాటు సన్ డే ఫన్ డే జరగడం విదితమే. కరోనా నేపథ్యంలో అప్పట్లో దీనిని వాయిదా వేయగా ఏడాది తరువాత మళ్లీ ప్రారంభమయ్యింది. ఆదివారం కావడంతోపాటు సాయంత్రం వేళ వేల సంఖ్యలో ప్రజలు తమ కు టుంబాలతో కలిసి ట్యాంక్‌బండ్ వద్దకు తరలివచ్చారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై సందర్శకుల కోసం సర్కారు ఏర్పాటు చేసిన మౌలిక వసతులు వారికి ఊరటనిచ్చాయి. సాయం సంధ్యవేళ ముగిసి, చీకటి పడ్డాక అప్పర్ ట్యాంక్‌బండ్‌పై కొత్తగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు సైతం సందర్శకులను అలరించాయి. ట్యాంక్‌బండ్ అందాలను వీక్షించేందుకు వచ్చిన సందర్శకులతో బల్దియా అధికారులు, పోలీసు అధికారులు మాట్లాడి ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఆదివారం నాడు సాయంత్రం వేళ ఆరు గంటల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంపై సందర్శకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబాలతో సరదాగా గడిపేందుకు వచ్చిన తమకు తీయటి అనుభూతు లను ఇచ్చాయని వారు వెల్లడించారు. సందర్శకులతో పాటు వచ్చిన చిన్నపిల్లలు చల్లటి వాతావరణంలో కేరింతలతో సందడి చేశారు. కాగా ట్యాంక్‌బండ్‌ను తిలకిం చేందుకు వచ్చిన వారి కోసం చిరు వ్యాపారులను పోలీసులు అనుమతించడంతో వారి వ్యాపారాలు జోరుగా సాగాయి. తినుబండారాలతో పాటు ఐస్ క్రీంలు అమ్మేవారు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వచ్చారు. ట్యాంక్‌బండ్‌పై ఆదివారం నాటి దృశ్యాలు గణేష్ నిమజ్జనోత్సవాలను తలపించాయి. కాగా సన్ డే ఫన్ డే సందర్భంగా చార్మినార్ వద్ద కేవలం షాపింగ్ వరకే సాగడం గమనార్హం. వర్షం కారణంగా సంగీత కార్యక్రమాలు సవ్యంగా సాగలేదు.



**ఆంక్షల నేపథ్యంలో వాహనాల మళ్లింపు**

**వాహనదారుల ఇక్కట్లు**

ఇదిలా వుండగా సన్‌డే ఫన్ డే సందర్భంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై విధించిన ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల గుండా మళ్లించారు. లిబర్టి నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చిన వాహనాలను అంబేద్కర్ విగ్రహం మీదుగా తెలుగు తల్లి, ఇక్బాల్ మినార్ వైపు మళ్లించగా తెలుగు తల్లి విగ్రహం నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చిన వాహనాలను అంబేద్కర్ విగ్రహం మీదుగా లిబర్టి, హిమాయత్ నగర్ వైపు మళ్లించారు. కర్బలా మైదాన్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చిన వాహనాలను కవాడిగూడ, డిబిఆర్ మిల్స్ కట్ట మైసమ్మ, తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వైపు, బషీర్‌బాగ్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చిన వాహనాలను అంబేద్కర్ విగ్రహం మీదుగా తెలుగుతల్లి, ఇక్బాల్ మినార్ వైపు మళ్లించారు. డిబిఆర్ మిల్స్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చిన వాహనాలను గోషాల, కవాడిగూడ. బైబుల్ హౌస్ వైపు, ఇక్బాల్ మినార్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే వాహ నాలను తెలుగుతల్లి ఫ్లై ఓవర్ మీదుగా మళ్లించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చిన వాహనదారులకు లేపాక్షి, డాక్టర్ కార్స్, ఆదర్శనగర్‌లోని ఎంఎల్ఎ క్వార్టర్స్, సచి వాలయం ప్రాంతాలలో పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్బలా మైదాన్ వైపు నుంచి వచ్చే వాహనదారులు సైలింగ్ క్లబ్, బుద్ధ భవన్, నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ గ్రౌండ్స్ వద్ద పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాత్రి పది గంటల తరువాత ఆంక్షలు తొలగించడంతో ట్యాంక్‌బండ్‌పై వాహనాల రాకపోకలు తిరిగి యధావిధిగా కొనసాగాయి.

### ఎస్‌బిఐ నర్సాపూర్ శాఖలో భారీ మొత్తం

# సొమ్ములు గోల్‌మాల్

**నర్సాపూర్, ఆగస్టు 14, ప్రభాతవార్త:** నర్సాపూర్‌లోని ఎస్‌బిఐ బ్యాంక్‌లో పెద్ద మొత్తం లో నగదు గోల్‌మాల్ అయిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే నర్సాపూర్ పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంక్‌లో 5 కోట్ల 20 లక్షల రూపాయిల వరకు నగదు గోల్‌మాల్ జరిగింది.నర్సాపూర్‌లో ప్రాంతంలో ఈ బ్యాంక్‌లోజరిగిన కుంభకోణం సంచలనం సృష్టించింది.ఈ విషయమై బ్యాంక్ ఉన్నాతాదికారులు సిబిఐ అధికారులకు సమాచారం అందించగా ఈబ్యాంక్‌లో విచారణ జరిపి డబ్బులను గోల్‌మాల్ చేసినట్లు ధృవీకరించారు.ఇందులో అనుమానిస్తున్న బ్యాంక్ హెడ్ క్యాషియర్ తో పాటు విధులను నిర్లక్ష్యం వహించిన అప్పటి బ్యాంక్ మేనేజర్, అకౌంటెంట్, సెక్యూరిటీ గార్డ్, అటెండర్ లను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. దీంతో బ్యాంక్‌లో పని చేసిన ఉద్యోగులు వేరేవేరు చోట్లకు డబ్బులను బదిలీ చేశారని సమాచారం. ఈమేరకు నర్సాపూర్ ఎస్‌బిఐ బ్యాంక్‌లో మొత్తం కొత్త ఉద్యోగులను నియమించారు.ఇంకా పూర్తి స్థాయిలో అధికారులతోవిచారణ జరుగుతుందని తెలిసింది.నర్సాపూర్ ప్రాంతంలో ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు గోల్‌మాల్ కావడంతో నర్సాపూర్‌లో చర్చనీయాంశంగా మారింది.ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మొత్తం విషయాలు బయటపడతాయని పలువురు చర్చించుకుంటున్నారు.



నర్సాపూర్‌లోని ఎస్‌బిఐ బ్యాంక్ భవనం

## నా భర్త హత్యపై స్థానిక నేతల హస్తం

### ఎల్లమ్మగూడెం సర్పంచ్ సంధ్యారెడ్డి ధ్వజం

**నల్లగొండ, ఆగస్టు 14 ప్రభాతవార్త:** నా భర్త విజయరెడ్డిని హత్యలో స్థానిక నాయకులు హస్తం ఉందని ఎల్లమ్మగూడెం సర్పంచ్ సంధ్య ఆరోపించారు. నా భర్తను గత కొంత కాలంగా పార్టీ మారాలని స్థానిక నాయకులతో పాటు ఎమ్మెల్యే తీవ్ర ఒత్తిడి తెచ్చారని, పార్టీ మారక పోవడంతో పలుమార్లు హత్య చేసేందుకు ప్రయత్నం జరిగిందని ఈ విషయంపై తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఇచ్చిన ఫిర్యాదును చిత్తు కాగితంలా చూశారని ఆరోపించారు. పోలీస్ వారి నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందన్నారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లో ఒక ఫంక్షన్‌లో దాడి చేయాలని ప్రయత్నం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తనను నిర్బంధించారని, అప్పుడే తన భర్తపై దాడి చేయాలనుకున్నారు. గ్రామస్తులు ఉండడంతో వెళ్లిపోయారు గమనించిన నాభర్త తపి ్పంచుకున్నారు. ఈ విషయంపై తిప ్పర్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాను స్పందించలేదు. స్థానిక నాయకులే పొట్టన పెట్టుకున్నారు. ఎల్లమ్మగూడెంలో మేము సర్పంచ్‌గా ఉండటం మా ఎదుగుదలను జీర్ణించుకోలేకనే ఓర్వలేక ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడ్డ వారిని, సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంధ్య కోరారు.

